క్లుప్తంగా

జార్జిబాబుకు అమరావతి కీర్తి పురస్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుకు చెందిన విద్యావేత్త, ఒలీవ స్కూల్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ సక్కా జార్జిబాబు అమరావతి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం విజయవాడలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యా, సామాజిక సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ నుంచి జార్జిబాబు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్లకు ఆషాఢ సారె



నగరంపాలెం: స్థానిక కొత్తపేట శ్రీజగన్నాథ స్వామివారి దేవస్థానంలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామికి ఆషాఢ సారె మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆకుల గీతాలక్ష్మి ఆధ్వర్యంలో శ్రీజగన్నాథ స్వామి భజన మండలి కోలాటం అలరించింది. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామికి ఆడికృత్తిక నక్షత్రం సందర్భంగా ఆదివారం పలు పూజలు జరిపారు. అర్చకులు శివకుమార్‌శర్మ వేదమంత్రాల నడుమ విశేష ద్రవ్య, పంచామృత అభిషేకార్చనలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ పాలక మండలి చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విశ్వ బ్రాహ్మణ సమాజం అభ్యున్నతికి కృషి



నెహ్రూనగర్: ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం నూతన అధ్యక్షులుగా జంపని రాధాకృష్ణమూర్తి నియమితులయ్యారు. విశ్వ బ్రాహ్మణ సమాజం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్ పేట మూడో లైన్‌లోని దేశీయ విశ్వ బ్రాహ్మణ సమాజం ప్రాంగణం వద్ద మహాజన సభ నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షులుగా కె. నంద వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి శ్రీనివాస సుధాకర్‌రావు, కార్యదర్శిగా పూసపాటి గిరిధర్, కోశాధికారిగా కందేపు వెంకట్రావులను ఎన్నుకున్నారు. ఎలక్షన్ కమిటీ చైర్మన్‌గా పాములపాటి మల్లేశ్వరరావు వ్యవహరించారు. ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ విశ్వబ్రాహ్మణ సమాజం మహాజన సభ సాక్షిగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి తెలియజేశారు. విశ్వ బ్రాహ్మణ సమాజం అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, హైకోర్టు న్యాయవాది అడవికొలను వేణుగోపాల కృష్ణ, యోగి మహేశ్వరానంద గురూజీ, విశ్వకర్మ పీఠం వైస్ చైర్మన్ తుమోజు రామలక్ష్మణాచార్యులు, సభ్యులు కె. గణేష్ బాబు, అత్తలూరి శ్రీధర్ పాల్గొన్నారు.

ఏ గమ్యానికీ ఈ పయనం!

- నడిరోడ్లపై అనాలోచిత ప్రయాణాలు
- కోరి కొనితెచ్చుకుంటున్న ప్రమాదాలు





ద్విచక్ర వాహనాలపై కుటుంబాలతో కలిసి ఐదారుగురు కలిసి వెళ్తున్న దృశ్యం

పట్నంబజారు: ద్విచక్ర వాహనంపై ఒకరు అనుకూలం.. ఇద్దరితో ప్రయాణం అంగీకారం ..ముగ్గురు ప్రమాదకరం.. ఇక ఆపై ఎంతో ఇబ్బందికరం అని తెలిసినా పట్టణ ప్రజలు పట్టించుకోవడం లేదు.

విద్యావంతులు సైతం ఐదారుగురిని ఎక్కించుకుని వెళుతూ, ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై నలుగురు, ఐదుగురు, ఏకంగా ఆరుగురు ఎక్కి ప్రయాణిస్తున్న దృశ్యాలు పట్టణంలో సర్వసాధారణంగా మారాయి.

అవగాహన లేమితో ప్రమాదాలు

అవగాహన లేమితో బైక్ మీద పరిమితికి మించి ప్రయాణాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. చేతులారా ప్రమాదాన్ని ఆహ్వానించడమే అవుతుంది. ఆటోలు, బస్సులలో కంటే ద్విచక్ర వాహనంపై వెళ్లిపోతే మూకుమ్మడిగా గమ్యానికి త్వరగా చేరుకోవచ్చన్న అనాలోచిత నిర్ణయంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుటుంబాలతో పాటు యువత ఇటువంటి పెడ ధోరణిని అవలంబిస్తూ రోడ్లను ప్రమాదాలకు నిలయాలుగా మార్చేస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఒక్క రూపాయి కూడా బీమా రాదన్న విషయాన్ని గుర్తించాలి.


ఇవిగో దృష్టాంతరాలు..

- గుంటూరు నగరంలో ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెళుతూ కోబాల్డుపేటలో కానిస్టేబుల్ ఢీకొట్టారు. అతని మృతికి కారణమవ్వంటో పాటు వారు ప్రమాదాల బారిన పడ్డారు.
- ఏటుకూరు రోడ్డులో జరిగిన ప్రమాదంలో యువకులు ట్రిపుల్ రైడింగ్ కారణంగానే మృతి చెందారు.
- కాకాని రోడ్డులోని వాసవీ కాంప్లెక్స్ వద్ద ట్రిపుల్ రైడింగ్ చేస్తూనే , బస్సును ఢీకొట్టి ముగ్గురు మృతి చెందారు.

వాహనదారుల్లో కనిపించని మార్పు

పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా , వాహనదారుల్లో కనీసం మార్పు రావటం లేదు. ఈ ఏడాది గుంటూరు నగరంలో మొత్తం 1358 కేసులు నమోదు చేసి, రూ. 13,58,000 జరిమానాలు విధించారు. ఇందులో 1,147 మంది జరిమానాల రూపేణా రూ. 11,47,000 చెల్లించాలి. అయితే 211 మాత్రమే చెల్లించడం గమనార్హం.

కఠిన చర్యలు తీసుకుంటాం



ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణిస్తేనే కఠిన చర్యలు ఉంటాయి. అటువంటిది నలు గురు, ఐదుగురు, ఆరుగురు ప్రయాణించడం అంటే దారుణం. ఇటువంటి వారి వల్ల తమతో పాటు తోటి ప్రయాణికులకీ ముప్పే. కోరి మరీ ప్రమాదాన్ని కొని తెచ్చుకోవటమే. ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్‌లతో అరికడతాం. –ఎం. రమేష్ (డీఎస్పీ, ట్రాఫిక్)

ఆటో కార్మికుల సమస్యలపై సీపీఐ పోరాటం



లక్ష్మీపురం: ఆటో కార్మికుల సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తెలిపారు. ఎన్నికల ముందు ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపేట సీపీఐ కార్యాలయంలో ఆదివారం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన ఆటో డ్రైవర్స్ – వర్కర్స్ యూనియన్ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ– చలానాలను రద్దు చేయాలన్నారు. రోడ్డుపై హక్కుతో జీవనం సాగించే ఆటో డ్రైవర్లను వేధిస్తున్న ఆర్టీవో అధికారులను తక్షణమే నియంత్రించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 36ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులు తమ వేదనను తెలిపారు. మహాసభలో ఆటో డ్రైవర్స్ యూనియన్ సీపీఐ శాఖ కార్యదర్శిగా మంగా శ్రీనివాస్‌తో పాటు 11 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభలో నగర కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, అంజి బాబు, మర్యాద దాస్, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాం ప్రసాద్, సహాయ కార్యదర్శి బాబర్ పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితమంతా అబద్ధమే..!



స్కానర్‌లు ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, పార్టీ నేతలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి.. వారిని దగా చేయడంలో చంద్రబాబును మించిన దగాకోరు ఎవరూ లేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గంలోని 30వ డివిజన్ ఏటీ అగ్రహారంలో ఆదివారం కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ రూపొందించిన కూటమి ఏడాది పాలనపై ప్రజలకు వివరించే స్కానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు జీవితమంతా అబద్ధమేనని విమర్శించారు. మంచి పథకాన్ని లేదా ఈ అభివృద్ధి చేశానని ఆయన చెప్పుకునేందుకు ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఏడాది అంతా వైఎస్సార్ సీపీని అణగదొక్కేందుకు మాత్రమే పరిపాలన సాగించారని మండిపడ్డారు. ప్రజల పక్షాన వారి గొంతుకై నిలిచేందుకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. కార్యకర్తలు, ప్రజల అభిమానం ముందు ఏ ఒక్క కుట్ర నిలబడలేదని చెప్పారు. ఆంక్షలు పెట్టి, పోలీసులను అడ్డుపెట్టుకుని వైఎస్ జగన్‌ను అడ్డుకోవటం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన మన నాయకుడు చూపిన దోవలో ముందుకు సాగాలని రాంబాబు పిలుపునిచ్చారు. కూటమి ఏడాది పాలన, సూపర్ సిక్స్ పథకాల అమలు, చంద్రబాబు వంచనపై పూర్తిస్థాయిలో వివరించాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. కచ్చితంగా రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు షేక్ రోషన్, ఈవూరి వనజాక్షి, సూరసాని వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని వివిధ వర్గాలకు సేవలు అందిస్తున్న వారిని ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా–2025 పురస్కారాలతో సత్కరించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్. నారాయణ మాస్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు, కార్మిక, కర్షకుల సేవలు, ప్రతిభను గుర్తించి వారికి ఆగస్టు 17న హైదరాబాద్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేవలను తెలియజేసే సర్టిఫికెట్ల ఫొటోస్టాట్, పేపర్ క్లిప్పింగ్స్, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలతో దరఖాస్తును ఈనెల 31లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు:1–20–164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపాలని సూచించారు. ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

యువకుడి అదృశ్యం



పట్నంబజారు: ప్రేమ పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించలేదని ఇంటి నుంచి యువకుడు వెళ్లిపోయిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పొన్నూరు రూరల్ మండలం గాయవారిపాలేనికి చెందిన డొక్కు విజయకృష్ణ పొన్నూరు రోడ్డులోని ఒక రూమ్‌లో అద్దెకు ఉంటూ, లక్ష్మీపురంలోని ఒక వస్త్ర దుకాణంలో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అదే దుకాణంలో పనిచేసే ఒక అమ్మాయిని ప్రేమించానని, వారి ఇంటికి వెళ్లి మాట్లాడాలని తల్లిదండ్రులను కోరాడు. దీనికి వారు నిరాకరించడంతో ఈ నెల 17వ తేదీ సాయంత్రం రూం నుంచి బయటకు వెళ్లిపోయాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో తల్లిదండ్రులు అడిగినప్పటికీ ఎటువంటి సమాచారం లభ్యం కాలేదు. దీనితో తండ్రి డొక్కు లక్ష్మీనరసింహరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సంగీత కచేరీ



నగరంపాలెం: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ కళా వేదికపై ఆదివారం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెలవారీలో భాగంగా ప్రసిద్ధ గాయకురాలు ఆత్రేయి కృష్ణా (చెన్నై) శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ అధ్యక్షతన డి.శ్యామసుందరి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్యాగరాజ కృతులతో పాటు పలు వాగ్గేయకార కీర్తనలను ఆమె శ్రావ్యంగా గానం చేశారు.

వివాహాలు శాస్త్రబద్ధంగా జరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ బ్రహ్మం, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: మన వ్యవస్థలో వివాహానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, అది శాస్త్రబద్ధంగా జరగాలని ప్రముఖ ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. కొత్తపేటలోని పచ్చిపులుసు కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (అవోపా) ఆధ్వర్యంలో ఆర్య వైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అవోపా గుంటూరుశాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రవచనకర్త కోటేశ్వరరావు మాట్లాడారు. ఎంతో పవిత్రమైన వివాహాన్ని ప్రస్తుతం ఫొటోలతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అవోపా ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అవోపా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. విశిష్ట అతిథులు పచ్చిపులుసు బలరామకృష్ణ, ఊటుకూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తున్నతీరు అభినందనీయమన్నారు. వివాహ పరిచయ వేదికలో 300 మంది పాల్గొన్నట్లు అవోపా కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. పరిచయ వేదికకు వచ్చిన యువతీ, యువకులను మహంకాళి శ్రీనివాసరావు, రంగా రత్నశ్రీ సభకు పరిచయం చేశారు. అనంతరం వధూవరుల ఫొటోలతో పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక కన్వీనర్ మంచుకొండ శ్రీనివాసరావు, కార్యదర్శి రాధాకృష్ణయ్య ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మహిళా విభాగం అధ్యక్షులు చింత కల్పన, నారాయణ పాల్గొన్నారు.

రుమటాలజీ సమస్యలకు అత్యాధునిక వైద్యం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న డాక్టర్ అలేఖ్య

లక్ష్మీపురం: కీళ్ల సమస్యలకు నేడు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ ఏ.అలేఖ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో ఆమె మాట్లాడారు. ఎముకలు, కీళ్లకు వచ్చే సమస్యల గురించి వివరించారు. ఎముకల్లో కాల్షియం తగు మోతాదులో లేని కారణంగా ఆస్టియో పోరోసిస్ అనే వ్యాధికి గురి అవుతారని తెలిపారు. దీనివల్ల చిన్న చిన్న కారణాలకు కూడా ఎముకలు విరిగే ప్రమాదం ఉందని చెప్పారు. దీన్ని అరికట్టడానికి కాల్షియంతో పాటు డీ విటమిన్ అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ ఉదయం కనీసం 60 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి తగిలే విధంగా వ్యాయామం లేదా వాకింగ్ చేయాలని ఆమె సూచించారు. శరీరంలోని వ్యాధి నిరోధకశక్తి బయట నుంచి వచ్చే వైరస్, బ్యాక్టీరియాలపై పోరాడకుండా మన పైనే దాడి చేసే స్థితిని కీళ్ల వాతం లేదా ఆస్టియో ఆర్థరైటిస్ అంటారని వివరించారు. ఈ సమస్యతో బాధపడే వారికి ఉదయం లేచిన వెంటనే దాదాపు 30 నిమిషాలు కీళ్లు పట్టినట్లు అనిపిస్తుందని చెప్పారు. ఈ లక్షణాలు కనబడితే రుమటాలజిస్ట్‌ను కలవాలని ఆమె సూచించారు. అనంతరం సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు.ఈ సభకు కోఆర్డినేటర్‌గా టి.వి.సాయిరాం వ్యవహరించారు. గాయత్రి కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ టి.సుబ్బారావు, అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి ప్రసంగించారు.

షటిల్ క్రీడాకారులకు నగదు సత్కారాలు



రంగబాబుతో నగదు పురస్కారాలు పొందిన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆటలను వృత్తిగా భావించి అందులో రాణిస్తున్న క్రీడాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత అసోసియేషన్లపై ఉందని షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాయపాటి రంగబాబు సూచించారు. షటిల్‌లో రాణిస్తున్న అరిగెళ్ల భార్గవ్ రామ్, డి.స్రవంతి, డి.దీపిక, కోటా సాయి సోహెల్, కోటా సాయి సోహాస్‌లకు రూ.30 వేల చొప్పున మొత్తం రూ.1.50 లక్షల చెక్కులను రంగబాబుతోపాటు జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అందజేశారు. కోచ్‌లను కూడా సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సతీష్ చంద్ర, బండారు రాము, రమేష్, శ్రీమాన్, హరి పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

అధికారులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశం

నెహ్రూనగర్: గత రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. విద్యుత్ అంతరాయం వల్ల తాగునీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ఏఈల వారీగా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిస్తే బెయిల్ అవుట్ చేయడానికి మోటార్లను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వర్షాలకు నీరు నిలిచే మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీల వద్ద నీటిని తొలగించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డ్రెయిన్లు, కల్వర్ట్‌లపై ఉన్న మెష్‌ల దగ్గర నిలిచే వ్యర్థాలను ఎప్పటికప్పుడు ప్రజారోగ్య కార్మికులు తొలగించేలా ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. గాలుల వల్ల రోడ్ల మీద చెట్లు కూలితే తొలగించేందుకు తగిన సిబ్బందితో సిద్ధంగా ఉండాలని ఏడీహెచ్ నిఆదేశించారు. వర్షాలు మరో రెండు రోజులు ఉంటాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

దుర్గగుడికి పలువురు భక్తుల విరాళాలు



ఉచిత ప్రసాదానికి విరాళం అందిస్తున్న గుంటూరుకు చెందిన దాతలు



తాడేపల్లికి చెందిన దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారి సన్నిధిలో నిత్యం జరిగే ఉచిత ప్రసాద వితరణకు గుంటూరు భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. చంద్రమౌళీనగర్‌కు చెందిన శ్రీ మోహన్‌సాయి, లక్ష్మీనారాయణ, రజనీ, డాక్టర్ అనులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం ఇంద్రకీలాద్రికి వచ్చారు. శివశంకర్, పద్మల పేరిట ఉచిత ప్రసాద వితరణకు రూ. లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

గో సంరక్షణకు రూ. లక్ష

దుర్గమ్మ సన్నిధిలోని గోసేవ పథకానికి గుంటూరుకు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. తాడేపల్లికి చెందిన జి.రంగలక్ష్మి, సూర్యనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయ ఈవో శీనానాయక్‌ను కలిసి గోసంరక్షణ నిధికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు.

ట్రా'ఫికర్'తో విలవిల



జీజీహెచ్ ఓపీ, క్షయ నివారణ కేంద్రం ఎదుట నిలిపిన మోటారుసైకిళ్లు



కాస్త దారిలోనే రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు



వరుసగా ఆటోల నిలుపుదల

గుంటూరు జీజీహెచ్, రైల్వేస్టేషన్ తూర్పు వైపు ప్రధాన ద్వారాల ఎదుట ట్రాఫిక్ స్తంభించిపోతుంది. బయటకు వచ్చేందుకు ప్రయాణికులు, రోగులు, సహాయకులు కనీసం ఐదు నిమిషాలకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది. ఉదయం వేళ సమస్య మరింత జటిలంగా ఉంటోంది. అంబులెన్స్‌లు వస్తే కదలడం కాస్త కష్టంగానే ఉంటోంది. దీనికితోడు జీజీహెచ్‌కు వచ్చే వారు మోటారు సైకిళ్లను క్షయ నివారణ కేంద్రం, ఓపీ ప్రధాన ద్వారాల దగ్గరే పార్కింగ్ చేస్తున్నారు. అక్కడే తినుబండారాల దుకాణాలు సైతం వెలిశాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇరవై అడుగుల రోడ్డు కాస్త నాలుగైదు అడుగులతో కుదించుకుపోతుంది. ట్రాఫిక్ పోలీసులు ఉంటున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. –నగరంపాలెం